# పన్ను విధానాలపై అవగాహన అవసరం

## ఐసీఏఐ చైర్మన్ ఎం.వెంకటేశ్వరశర్మ

విశాఖపట్నం: పన్ను విధానంలో నానాటికీ వస్తున్న మార్పులపై తగిన అవగాహనతో వృత్తిపరంగా రాణించే అవకాశం ఉందని ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) విశాఖపట్నం బ్రాంచి చైర్మన్ ఎం.వెంకటేశ్వరశర్మ పేర్కొన్నారు. పిఠాపురం కాలనీలోని సంస్థ కార్యాలయంలో 'ప్రత్యక్ష పన్నుల కోడ్ బిల్లు-2009'పై శనివారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఆగస్టు 10న కేంద్ర ఆర్థికశాఖ మంత్రి ప్రత్యక్ష పన్నుల కోడ్ బిల్లు-2009 ముసాయిదాని ఢిల్లీలో విడుదల చేశారని, దీనిద్వారా పన్ను విధింపులో కొత్త విధానాలు తీసుకొస్తున్నట్లు చెప్పారు. ఇందులో లోపాలపై చర్చించి ప్రభుత్వం సవరించేలా సూచనలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇలాంటి సదస్సుల ద్వారా ఛార్టర్డ్ అకౌంటెంట్లు వృత్తి నైపుణ్యం పెంచుకోవచ్చని చెప్పారు. ఢిల్లీ ఐటీఏటీ బార్ అసోసియేషన్ కన్వీనర్ కపిల్‌గోయిల్, ఢిల్లీలోని కేపీఎంజీ మేనేజర్ నవన్ గుప్తా మాట్లాడుతూ ముసాయిదా బిల్లులోని ప్రధాన అంశాలను వివరించారు. ఈ బిల్లు వల్ల భవిష్యత్తులో పన్ను భారం పెరిగే అవకాశం ఉందన్నారు. విదేశీ పెట్టుబడులపై పన్ను విధింపు సరికాదన్నారు. రాజమండ్రి, శ్రీకాకుళం, కాకినాడ తదితర ప్రాంతాల ఛార్టర్డ్ అకౌంటెంట్లు హాజరైన సదస్సులో ఐసీఏఐ విశాఖపట్నం బ్రాంచి కోశాధికారి ఎం.కె.కుమార్, వైస్ చైర్మన్ సీఎం రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



హాజరైన ఛార్టర్డ్ అకౌంటెంట్లు ( అంతర చిత్రంలో) మాట్లాడుతున్న కపిల్‌గోయిల్